


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



### నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

## బీ పాజిటివ్

**పాజిటివ్ థింకింగ్ గురించి** ఒక మిత్రుడు నాతో నిన్న చాలా సేపు మట్లాడాడు. అతను సీరియస్‌గా మాట్లడ్తుంటే నాకు సడెన్‌గా నవ్వొచ్చింది.

"ఎందుకు నవ్వుతున్నావు?" అడిగాడు.

"జోక్ గుర్తొచ్చిందిలే" అన్నాను.

"ఏంటదీ?"

"ఒకడు తను పెళ్ళాడబోయే అమ్మాయితో చెపుతున్నాడట. మా అన్న లారీ ఏడుగురి మీదనుండి తీసుకెళ్ళి, అరెస్ట్ అయి తీహార్ జైల్లో ఉన్నాడు. మా నాన్న బ్యాంక్ రాబరీ కేసులో అరెస్ట్‌అయి పదేళ్ళుగా జైలులో ఉన్నాడు. అమ్మ కోడల్ని కిరోసిన్ పోసి కాల్చిందని కోర్టులో విచారణ జరుగుతోంది" అని.

ఆమె కోపంగా "మీ ఇంట్లో ఒక్కరు కూడా పాజిటివ్‌గా లేరా?" అందిట.

అతను "నేనున్నానుగా.. హెచ్. ఐ. వీ పాజిటివ్." అన్నాడుట.

పాజిటివ్ థింకింగ్ గురించి చెపుతున్నమిత్రుడు "నీకు దేన్లోనూ సీరియస్‌నెస్ లేదు" అని అలిగాడు.

ఇంతలో వాళ్ళ అబ్బాయి "నాన్నా బైక్ కీస్" అంటూ వచ్చాడు.

"తీస్కో. గానీ నెమ్మదిగా వెళ్ళు. అర్ధరాత్రుళ్ళు తిరక్కు, ఏక్సిడెంట్స్ అన్నీ అప్పుడే అవుతాయి. మొన్న ఇలాగే మా గణపతి గాడి కొడుకు అర్ధరాత్రి వస్తుంటే ఎవడో తాగొచ్చి గుద్దేశాడు. పిల్లాడు ఆన్ ది స్పాట్ పోయాడు" అన్నాడు.

కొడుకు తల ఎగరేసి వెళ్ళిపోయాడు.

ఇతని పెళ్ళాం చీరల షాపు నుండి వచ్చింది. "మీ అక్క వస్తోందిగా, గద్వాల చీర కొన్నాను" అని చూపించింది.

"కార్డే వాడావా? క్యాషా?" అడిగాడు.

"క్రెడిట్ కార్డే? ఏం?"

"గీసేటప్పుడు నువ్వు అక్కడే ఉన్నావా? చీరల్ని చూస్తూ ఒళ్ళు మరచిపోయావా? మొన్న మా కొలీగ్ పెళ్ళాం ఒక వెయ్యిరూపాయల చీర కొని కార్డ్ ఇచ్చిందిట. అతను బిల్ ఇస్తే, కార్డు తీసుకుని ఇంటికొచ్చింది. అతను ఎన్నిసార్లు కార్డ్ గీసాడో, ఈవిడ చూడలేదు. లక్షరూపాయలు ఎకౌంట్ లోంచి మాయం. వాడు లబో దిబో!" అన్నాడు.

ఆవిడ భయంగా చూసింది.

ఇంతలో గోడమీద బల్లి అరిచింది.

"వెధవ బల్లిని చంపేసెయ్. ఏ సాంబార్లోనో పైనుండి పడితే ఇంటిల్లిపాదిమీ చచ్చి ఊరుకుంటాం" అన్నాడు.

ఇంతలో ఇతని చెల్లెలి దగ్గరనుండి ఫోన్ వచ్చింది." రేపు మధ్యాహ్నం ఫ్లైట్లో వెళ్తున్నారా? ఓ..కే. లగేజ్ జాగ్రత్త. సాధారణంగా నాలుగు సూట్ కేసులు తీసుకెళితే ఒకటి పోతుంది" అన్నాడు.

అతని పనులన్నీ అయి వచ్చి కూర్చుని "మనం పాజిటివ్ థింకింగ్ గురించి కదూ మట్లాడుతున్నాం. అసలు అరిస్టాటిల్ ఏమన్నాడంటే" అని చెప్పబోయాడు.

"నీ పాజిటివ్ థింకింగ్ చూస్తూనే ఉన్నాను కానీ వెళ్ళొస్తా" అని లేచాను.

"చాలా పొద్దుపోయింది. డ్రైవర్ మంచివాడేనా?" అని ఏదో అడగబోయాడు.

"అబ్బే! పోయిన వారమే జైలునుండి విడుదలయ్యాడు. అంతకు ముందు పనిచేసిన చోట, యజమానురాలిని నగలకోసం చంపి, గోనుసంచిలో చుట్టి నీళ్ళలో పారేసాడుట. అయినా పట్టుబడ్డాడుట పాపం" అన్నాను.

"హా?" అని నోరు తెరిచాడు.

"లేకపోతే ఏమిటీ? ఇందాకటినుండి నువ్వు కొత్తగా కొని చదివిన పుస్తకంలో పాజిటివ్ థింకింగ్ గురించి మాట్లాడావ్. కానీ ప్రాక్టికల్‌గా నిమిషం కూడా పాజిటివ్‌గా ఆలోచించలేకపోతున్నావు. పిల్లాడు బయట కెళ్తుంటే "బైక్ స్పీడ్‌గా నడపకు. చూస్కో" అని ఊర్కో. వెనకాల మాట్లాడిన అపశుభాలు ఎందుకూ?

క్రెడిట్ కార్డ్ లక్షల మంది వాడుతున్నారు. ఎస్.ఎమ్.ఎస్ అలర్ట్స్ పెట్టుకోమను. అంతేకానీ నీ అనుమానంతో ఆ ఇల్లాల్ని ఎందుకు చంపుతావు?

నీ చెల్లెలు శుభమా అని అమెరికా వెళ్తుంటే, సూట్‌కేస్ జాగ్రత్త అను – పోతుంది అన్న దీవెనెందుకు?

బల్లి సాంబార్లో పడ్తుందేమో? గ్యాస్ సిలిండర్ పేల్తుందేమో, కరెంట్ షార్ట్ సర్క్యూట్ అవుతుందేమో అని నెగిటివ్ థాట్స్ ఎందుకు?" అని క్లాస్ ఇచ్చాను.

"జాగ్రత్తలు చెప్పడం కూడా తప్పేనా? " అన్నాడు.

"జాగ్రత్తలు వేరూ, ఎప్పుడూ అశుభాలు మాట్లాడ్డం వేరూ. నువ్వు రెండోది చేస్తున్నావు" అని లేచి బయలుదేరాను.

వస్తుంటే నాకు దారంతా ఇదే ఆలోచన. మనిషికి భయం ఎక్కువైందా? లేక లోకంలో ప్రమాదాలు ఎక్కువయ్యాయా? ఎందుకు మనిషి అనుక్షణం ప్రతి పనికీ ఇంత భయపడ్తున్నాడు?

కొంతమంది ఇంటి పట్టునుండే ఆడవాళ్ళు మధ్యాహ్నాలు తీరుబడిగా మాట్లాడుకుంటారు "మా ఫ్రెండ్ తోటికోడలు మొన్న తోటకూర కొని ఫ్రిజ్‌లో పెట్టిందట. దాన్లో చిన్న పాముపిల్ల ఉందిట. చలికి అది గడ్డకట్టి చచ్చిందేమో, ఆవిడ దాన్ని తరిగి కూరొండి, భర్తకీ, పిల్లకీ క్యారేజీలు కట్టేసిందిట. మధ్యాహ్నానికల్లా పాపం అంతా చచ్చిపోయారు. ఆవిడ ఇంకా తినకముందే ఈ కబురు అందింది కాబట్టి ఆవిడ మాత్రం బతికిపోయింది. కానీ ఎందుకా పాడు బతుకు వదినా? కళ్ళముందే భర్తా, పిల్లలూ శ్మశానికి పోయారుట."

ఇది నిజంగా జరిగిందేమో తెలీదు. లేదా పాము ఉండడం వరకూ సత్యం. మిగతాది ఎవరిదో కల్పనా చాతుర్యం అయి కూడా ఉండి ఉండచ్చు. కానీ ఈ కబుర్ల వల్ల ఏం వస్తాయి. ఈవిడ ఇంకొకావిడకీ, ఆవిడ ఇంకో నలుగురికీ చెప్పడం వలన, ఆకుకూరలు కొనడానికి జనం భయపడే స్థితి వచ్చినా రావచ్చు.

"కుర్ కురే తినకూడదు. దాంట్లో ప్లాస్టిక్ ఉంటుంది" అంటాడు ఓ పెద్దమనిషి.

ఇంకొకడు "మా ఫ్రెండ్‌కి కడుపులోంచి కిలో ప్లాస్టిక్ తీసారు" అని ఇంకోడికి నాటకీయంగా చెప్పి "అతను ఇష్టంగా కుర్ కురే తినేవాడు" అని కొసమెరుపు ఇస్తాడు.

"మా ఫ్రెండ్ ఒకడు ఆత్మహత్య చేసుకోవాలని నాలుగు కూల్ డ్రింక్ సీసాలు కొని ఒకేసారి తాగాడు. దెబ్బకి వాటిల్లో ఉన్న పురుగుల మందువల్ల పోయాడు" అంటాడు ఇంకోడు.

ఇంట్లో ఒక్కతే ఉన్న ఇల్లాలికి, ఒకావిడ ఫోన్ చేసి "వదినా ఒకదానివే ఉన్నావా? జాగ్రత్త. గ్యాస్ సిలిండర్ వాడిలా వచ్చి మా వెనక వీథిలో ఒకావిడ్ని రాళ్ళతో మోది చంపి, నగలన్నీ దోచుకుపోయారుట. ఇంకొకావిడ్ని ఇంట్లో నగలు లేవనీ, రోల్డ్‌గోల్డ్ గొలుసు వేసుకుందనీ, చంపేసారుట" అంటుంది.

ఈ పై రెండు స్టేట్‌మెంట్ల వల్లా, ఈ ఫోన్ తీసినావిడకి నగలు వేసుకున్నా, వేసుకోకపోయినా మృత్యువు తప్పదన్న భయం పట్టుకుంది.

"ఏంటీ? వైజాగ్ వెళ్తున్నావా? వెరీ గుడ్ గోదావరిలోనా. వెరీగుడ్ 1985లో ఒకసారి గోదావరి తెల్లవారుఝామున పట్టాలు తప్పింది. నూట పధ్నాలుగు మంది స్పాట్ డెత్. శవాలు ఇలా ఎగిరిపడ్డాయి అంతెత్తున" అని హుషారుగా చూపిస్తాడు ఒకాయన.

ఇలాంటి న్యూస్‌లు చెప్పడం జాగ్రత్తలు చెప్పడమా? వెళ్ళేవాడిని బెదరగొట్టి చంపడమా?

మా ఆయనకి ఎవరు పంపిస్తారో కానీ అన్నీ దిక్కుమాలిన మెయిల్స్ వస్తాయి.

"లాప్ టాప్ పరుపుమీద పెట్టుకుని నిద్రపోతున్న కుర్రాడికి, అందులోంచి మంటలొచ్చి పరుపూ, ఇల్లూ అంటుకుపోయినా మెలుకువ రాలేదుట. చచ్చిపోయాడుట"

"చార్జర్‌లో పెట్టి మాట్లాడుతున్న ఒకావిడ సెల్ పేలి, అక్కడికక్కడే చచ్చిపోయిందిట"

"ఏ.టీ.ఎమ్ డబ్బులు తీస్తుంటే వెనకాలే వచ్చిన అగంతకుడు మెడకి పిస్టల్ పెట్టి, మొత్తం డ్రా చేయించి వెళ్ళిపోయాడుట."

"రైల్లో బిస్కట్లలో విషం కలిపి పెట్టి మొత్తం సొమ్ము దోచుకుపోయిన దొంగల వివరం"

ఇలా చాలా మెయిల్స్ నాకు ఫార్‌వర్డ్ చేస్తుంటాడు మా ప్రభువు. పిల్లలకి కూడా ఇవి చూపించమని కింద సూచన కూడా ఉంటుంది.

నిజమే! అతి జాగ్రత్త మంచిదే కానీ ఇవి చదివి నిత్య జీవితంలో బయట కెళ్ళలేని పరిస్థితి రాకూడదు కదా!

ఒక ప్రొడ్యూసర్ ఉన్నాడు. సినిమా ప్రారంభించిన రోజు నుండీ "ఏవిట్రా ఆ కెమేరాలూ, అన్ని లైట్లూ? నేను ఈ దెబ్బతో నాశనం అయిపోతాను. నాకు తెలుసు. ఎక్కడైనా కర్రీ పాయింట్ పెట్టుకుని బతకాల్సిందే" అంటాడు.

చిన్నప్పుడు మా పక్కింట్లో ఒకాయన ఉండేవాడు, పెళ్ళాన్ని "ఎందుకే మేడమెట్లు అంత దూకుడుగా ఎక్కుతావు? ఎప్పుడో పైనుండి పడి మెదడు పగిలి పసర్ల లక్ష్మోజీరావుగారి పెళ్ళాంలా మంచంలో శవంలా పడుంటావు" అనేవాడు.

నేను చాలా సార్లు విన్నాను ఇదేమాట ఆయన నోటివెంట. ఈయనకి పెళ్ళాం అంటే ప్రేమా? అలా అవ్వాలన్నది కోరికా? అనుకునేదాన్ని.

మా చిన్నతనం అంటే గుర్తొచ్చింది. ఉత్తరాలొచ్చేవి. కొంతమంది ఉత్తరాలు ఇలా ఉండేవి

"రవణ దొడ్డా, ఇక్కడంతా క్షేమం. మీరంతా క్షేమం అని తలుస్తాను. మా పెద్దదానికి మొన్న కడుపులో పుండు అని డాక్టర్ పెద్దాపరేషన్ చేయాలన్నాడు. మా ఆయనకి రోడ్డుమీద నడుస్తుంటే, తూములో పడికాలు విరిగింది. ఆర్నెల్లు మంచంలో ఉండాలన్నారు. మా అత్తగారికి పక్షవాతం వచ్చి, కుడిచెయ్యి, నోరూ పడిపోయింది. నువ్వొచ్చినప్పుడు జున్నుతిన్నావే. ఆ మచ్చ ఆవు చచ్చిపోయింది. మన జగ్గారావు బాబాయి ఇంట్లో దొంగలు పడ్డారు. పిన్ని నగలూ, బాబాయి బట్టలూ అన్నీపోయాయి. ఇప్పటికి ఇంతే సంగతులు. వెంటనే జాబు వ్రాయి.

వ్రాలు

సీతారత్నం"

ఆ మొదటి వాక్యం "ఇక్కడంతా క్షేమం. అక్కడ క్షేమమని తలుస్తానుకీ, ఉత్తరానికీ పొంతన ఉండేది కాదు. కానీ ఆ వార్తలు చేరాలంటే ఆ రోజుల్లో మరి ఉత్తరం తప్పదు. కానీ 'ఉభయకుశలోపరి' అని వ్రాయడం రివాజు.

మా స్నేహితురాలింట్లో ముక్తేశ్వరం తాతగారని ఉండేవారు. ఆయన నట్టింట్లో పడక కుర్చీ ఫ్యాన్ కింద వేసుకుని పడుకునేవారు. కోడల్ని పిలిచి "పార్వతీ! రేపు అరటి ఊచ ఆవపెట్టి వండు. ఎల్లుండికి బతికి ఉంటానో లేదో. నాలుగురోజుల నుండీ నల్ల బట్టల్లో యముడు కలలో కొస్తున్నాడు" అనేవారు.

ఈయన అరటి ఊచ కూర కోసం యముడు కలలో కొచ్చేవాడు.

పిల్లలు ఆడుకుంటుంటే "ఒరే వెధవల్లారా చూసి పరిగెత్తండి. పడితే పుచ్చె పగిలిపోతుంది" అనేవారు.

"ఒసే కాళ్ళు దగ్గర పెట్టుకుని కూర్చో, పెద్దవాళ్ళకి తగిలితే నీ కళ్ళు పేలిపోతాయి" అనేవారు.

ఆయన నోట్లోంచి నేను ఒక్క శుభం వినేదాన్నికాదు.

అదే మా అమ్మమ్మ తల్లి మా దగ్గరే ఉండేది. మునిమనవలందరం ఆవిడ్ని 'నాయినీ' అని పిలిచేవాళ్ళం.

ఆవిడ నోట్లోంచి ఏనాడూ మేం తిట్టు వినలేదు. ఒక్క అపశుభం మాట వినలేదు. ఎవరన్నా అల్లరి చేస్తుంటే

"నీ ఇల్లు బంగారం కానూ!" అనేది.

ఆవిడకి మంకుపట్టు పట్టి కూర్చునే పిల్లాడిమీద విసుగొస్తే "పెళ్ళికొడుకా! ఇంక చాలురా లే అన్నం తిను" అనేది.

మరీ కోపం వస్తే "భడవ ఖానా" అని విసుక్కునేది.

ఎవరి గురించైనా చెపుతుంటే ఆశ్చర్యంగా "వాడింట్లో పెళ్ళవ్వా? అలా అన్నాడా?" అనేది.

వంట చేస్తున్నంత సేపూ గోవింద నామాలు పాడేది.

**"హరి నా మొరవిని వేగా రారా..**

**మక్కువతో నిను పిలిచేను గదరా**

**భద్రాద్రి రామా, సీతారామా, కోదండరామా"**

అని ఆవిడ వంట చేస్తూ పాడిన పాట మేమంతా నేర్చుకున్నాం.

వంట కమ్మగా ఉండేది. హాయిగా తిన్నవాళ్ళకి జీర్ణం అయ్యేది.

అదే మా పక్కింట్లో భారతమ్మ ఉండేది. వంట చేస్తున్నంత సేపూ పిల్లల్ని తిట్టేది "ఈ వంకాయలు ఎవరు తెచ్చారే, నిండా పురుగులే. నీ నోరుపడా క్ర్రి బుజ్జీ నువ్వు తెచ్చావా? ఒసే చిట్టీ ఈ పప్పు కలుపు. నీ చేతులిరగా. తొరగా రావే. ఒరే బాబ్జీ డాబా మీదనుండి బట్టలు తే. నీ నోట్లో మన్నుపడా!"

అది ఆవిడకి అలవాటు. అవసరం అయికాదు.

మా నాయనీ అలా అస్తమానం దేవుడ్ని తలుచుకుంటూ ఎందుకుండేదో ఇప్పుడర్థం అవుతుంది. నెగిటివ్ ఎనర్జీ ఇంటికి చాలా కీడు చేస్తుంది.

ఓ ప్రముఖ హీరో ఒకరోజు వంటవాడు బ్రేక్ ఫాస్ట్ వడ్డిస్తూ దోశకింద పడేసాడని, లేచి తింటున్న చేత్తోనే గూబమీద కొట్టాడు.

ఎదురుగా ఉన్న పెద్దమనిషి చెప్పాడు. "నీ ఫ్రెష్ ఎండ్ పవర్ ఫుల్ ఎనర్జీని కోపం వల్ల వేస్ట్ చేసేసుకున్నావ్. మళ్ళీ రేపటిదాకా ఆగాలి. ఆ ఎనర్జీ కోసం అసలే నువ్వు హీరోవి" అని.

నేను వీలైనంతవరకూ ఉదయం పూట కోపం తెచ్చుకోను (అంతా ఇంట్లోంచి వెళ్ళేదాకా నిద్రలేవకపోతే సరిపోతుంది.)

ఒక రోజున నా స్నేహితురాలు తన కొలీగ్ నన్ను చూడాలంటోందని మా ఇంటికి తీసుకొచ్చింది.

ఆవిడ టీచర్. "మావారి తరపువారందరూ మమ్మల్ని చూసి ఏడుస్తుంటారండీ!" అంది.

"ఎందుకూ?" అన్నాను.

"మా వారే ఎక్కువ చదువుకున్నారు. మంచి ఉద్యోగం కూడానూ!"

"మంచిదేగా!" అన్నాను అమాయకంగా.

"మూర్తికేం తక్కువా? అంటుంటే దిష్టి ఆయనకి. ఎప్పుడూ కాళ్ళనొప్పులు. నాకేమో అజీర్తిరోగం"

"మీ ఇద్దరూ డాక్టర్ దగ్గరకెళ్ళండి. ఆ రోగాలకీ, మీ వాళ్ళకీ ఏం సంబంధం లేదు" నేనేదో చాలా తెలివైనదానిని అనుకుని చెప్పాను.

"పాపం మీరు ఉత్త అమాయకులు. నరుడు కన్నుకి నల్లరాయి పగుల్తుంది అన్నట్లు, వాళ్ళ వాళ్ళ ఏడుపు వల్లే నండీ మా అమ్మాయికి 98 పర్సెంట్ వచ్చినా మెడిసన్‌లో సీట్ రానిది. ఈ రోగాలు కూడా ఎన్ని మందులు వేసుకున్నా తగ్గవు. గుళ్ళో స్వామీజీ చెప్పారు. మా మీద చాలా ఏడుపు ఉందిట."

నేను ఈ ఏడుపులూ, దిష్టిలూ మనని ఏం చెయ్యలేవు అని చెప్పి ఒప్పించడానికి ప్రయత్నించి, చివరికి ఓడిపోయి నిస్సహాయంగా మా ఫ్రెండ్ వైపు చూసాను. అది నవ్వు ఆపుకోలేక అవస్థపడ్తోంది. వీళ్ళకి స్కూల్లో రోజూ ఈవిడ మాటలు అలవాటే అన్నమాట.

కొంతమందికి అన్నీ బెంగలే. అన్నీ బాధలే నిత్యవిచారులు.

"అబ్బబ్బా! వాన చచ్చిపోతున్నాం. బట్టలు ఆరట్లేదు. ఏం చెయ్యాలో ఏమో?" అని పదిసార్లు విసుక్కుని, ఇంటికి వచ్చిన అందరికీ చెప్తుంటారు.

ఆవిడ మొహం ఎప్పుడూ ముటముటే.

ఎండాకాలం అదే మొహంతో "అబ్బబ్బబ్బా! ఒకటే ఎండలు. గచ్చు పగుల్తుందేమో అనిపిస్తోంది. భరించలేకపోతున్నాం ఈ ఉక్క."

ఎండాకాలం ఎండా, వానాకాలం వానా, శీతాకాలం చలీ తప్పవుగా. వాటికి మనం బాధపడుతూ, విచారిస్తూ కూర్చుంటే ఇంకెప్పుడు జీవితాన్ని సుఖంగా అనుభవిస్తాం?

"ఏవిటే ఇంత డల్‌గా ఉన్నావు వనజా?" అని ఒక ఫ్రెండ్‌ని అడిగితే, "చిన్నదానికి నాగరం, జడకుప్పెలూ చేయించానే, ఇంకా ఒంకీ, వడ్డాణం చేయించాలి. ఈయన పట్టించుకోరు. మా తోటికోడలి కూతురు దీనికన్నా చిన్నది. దానికి అప్పుడే వడ్డాణం చేయించేసారు." అని ప్రపంచంలో బాధలన్నీ తనకే వచ్చినట్లు చెప్తుంది.

ప్రపంచంలో సగం జనాభాకి రెండు పూటలా కడుపునిండా తిండీ, చాలా చోట్ల మూడు రోజులకి ఒక్క బక్కెట్ నీళ్ళు కూడా లేవని ఆమెకి తెలీదు. ఇంకా చాలామంది తాము బాగుపడాలని కోరుకోరు. పక్కవాడు నాశనం అయిపోవాలని కోరుకుంటారు.

ఒకావిడ పెద్దబొట్టు పెట్టుకుని, పొద్దస్తమానం పూజలు చేస్తూ, తులసి కోట చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూ కనిపిస్తే మనం ఆవిడ్ని పుణ్యాత్మురాలు, పతివ్రత అనుకుంటాం. కానీ ఆవిడ మనసులో అత్తగారికి నోరూ, భర్తకి కాలూ పడిపోవాలని కోరుకుంటుందని ఎవరూ కనిపెట్టలేరు అని రాసారు యండమూరి ఒక పుస్తకంలో.

మనకి ఇది చదివి నవ్వొచ్చినా, నిజం. కొంత మంది నెగిటివ్ ఎనర్జీ వినియోగించినట్లు పాజిటివ్ ఎనర్జీ వినియోగించరు.

ఒక ఇరవై ఏళ్ళ అమ్మాయి అసిస్టెంట్ డైరెక్టర్ గా కొత్తగా చేరింది మా యూనిట్లో. ప్రొడ్యూసర్ ఒక రోజు "ఏమ్మా పెళ్ళయిందా?" అని అడిగాడు.

"లేదండీ" అంది.

ఆయన వెళ్ళిపోయాక "ఆయన అలా ఎందుకన్నాడు? నేను పెద్దదానిలా కనిపిస్తున్నానా?" అని నాతో చర్చించింది.

"ఊరికే ఏదో ఒకటి మాట్లాడాలి కాబట్టి మాట్లాడాడు అంతే!" అన్నాను.

ఇంక కాసేపటికి ఒక కుర్రాడితో ఇదే టాపిక్ మాట్లాడుతూ కనపడింది ఆ అమ్మాయి.

సాయంత్రం ఫోన్‌లో ఫ్రెండ్‌కి ఇదే విషయం చెపుతూ కనిపించింది. "నేను పెళ్ళయిన దాన్లా కనిపిస్తున్నానా?" అనే విషయం ఆమె మనశ్శాంతిని పూర్తిగా హరించింది. ఇది నెగిటివ్ థింకింగ్‌కి ఒక మచ్చుతునక.

పెద్దాయన పెళ్ళయిన అమ్మాయి అయితే ఇంటికి త్వరగా వెళ్ళమని చెప్దాం అనుకున్నాడేమో. ఇది పాజిటివ్ థింకింగ్.

చాలామంది ఎవరైనా వీళ్ళు ఫోన్ చేసినప్పుడు ఫోన్ తియ్యక పోతే అవమానంగా ఫీలవుతారు. నన్ను చాలామంది అలిగి, కోపపడి తిట్టారు కూడా.

అది ఆత్మన్యూనతా భావం, ఒక్క నిమిషం డ్రైవింగ్‌లో ఉన్నారేమో? అప్పుడే ఏ బాత్ రూంలోకో వెళ్ళారేమో. ఇంటిముందు ఏ ఆకుకూరలు కొనడానికో వెళ్ళారేమో అని ఆలోచిస్తే ఆ మధన ఉండదు. మిస్డ్ కాల్స్ చూసి చెయ్యకపోయినా, ఇంతకన్నా పెద్ద సమస్యలోనో, జబ్బులోనో, పనిలోనో ఉన్నారేమో అని ఆలోచిస్తే మనసుకి హాయిగా ఉంటుంది.

మనని పట్టించుకోలేదు. చిన్నతనం చేసారు అనుకుంటే మనశ్శాంతి దూరం అవుతుంది.

ఇద్దరు ముగ్గురు నన్ను మీకు లైఫ్‌లో డిప్రెషన్ రాదా? అని అడిగారు. నాతో సత్యానంద్ గారు (ప్రముఖ సీనియర్ సినీ రచయిత) ఒక మాట చెప్పారు. "ఎవరైనా కోపంగా మన మీద అరుస్తుంటే వాళ్ళని, చిన్న చీమలంత అయిపోయి తమాషాగా టేబుల్ మీద నిలబడి చేతులూపుతూ అరుస్తున్నట్లు ఆలోచించుకోండి భలే నవ్వొస్తుంది వాళ్ళని చూస్తే" అన్నారు.

ఇలాంటి టెక్నిక్స్ ఉపయోగిస్తాను. ఇంటర్‌మీడియట్లో ఫ్యామిలీ అంతా తిరుపతి వెళ్తుంటే, ఎగ్జామ్స్ వల్ల నాకు వెళ్ళడం కుదరలేదు. "ఆ దేవుడికి నా దర్శనం ప్రాప్తం లేదు" అన్నానని మా సత్యప్రియ అనే క్లాస్ మేట్ ఇప్పటికీ చెప్పి నవ్వుతుంది.


పెద్ద పెద్ద నిరాసక్తతలని కూడా చిన్న చిన్న జోకులతో పారద్రోలచ్చు.

"ఈసారి ఓడిపోయాం అనుకోవడం" నెగిటివ్ థింకింగ్.

"ఈసారి అనుభవం సంపాదించాం. నెక్స్ట్ టైం సాధి ద్దాం" అనుకోవడం పాజిటివ్ థింకింగ్.

సో.. బీ పాజిటివ్.

Post your comments


కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి
సాహితి
కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి